# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 29 అక్టోబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## మొగిలిగిద్ద ప్రభుత్వ బడికి రూ.10 కోట్లు మంజూరు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ ఏడాది జనవరి 31న నిర్వహించిన ఆ పాఠశాల 150వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొగిలిగిద్ద జెడ్పీహెచ్ఎస్ నూతన భవన నిర్మాణం కోసం నిధులను కేటాయిస్తామంటూ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పుడు రూ.10 కోట్లు మంజూరు చేయడం గమనార్హం. ఈ పాఠశాలకు గొప్ప చరిత్ర ఉన్నది. ప్రస్తుతం తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమంలో బోధన సాగుతున్నది. హైదరాబాద్ రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన మర్రి చెన్నారెడ్డి, పౌరహక్కుల సంఘం నేత ప్రొఫెసర్ హరగోపాల్ కూడా ఈ పాఠశాలలో చదవడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే రూ.10 కోట్ల నిధులతో ఆ పాఠశాల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయి. ఆధునిక హంగులతో సర్వాంగ సుందరంగా పాఠశాల భవన నిర్మాణం కానుంది. దీంతో విశాలమైన తరగతి గదులు అందుబాటులోకి రానున్నాయి. ఇతర మౌలిక వసతుల కొరత తీరనుంది. విద్యార్థులకు ఉన్న ఇబ్బందులు తొలగిపోతాయి.

## నీటి పారుదల ప్రాజెక్టులపై
# అధ్యయనం చేయాలి

- ప్రాజెక్టుల వారీగా స్టేటస్ రిపోర్టులు సిద్ధం చేయాలి
- తుమ్మిడిహట్టి-సుందిళ్ల మధ్య 80 టీఎంసీల నీటి తరలింపు ప్రణాళిక సిద్ధం చేయాలి
- సీఎం రేవంత్‌రెడ్డి
- కేంద్ర జలశక్తి శాఖ లేఖపై సమీక్ష
- సుందిళ్ల, మేడిగడ్డ, అన్నారం పరిస్థితిపై సమీక్ష



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని అన్ని నీటి పారుదల ప్రాజెక్టులపై సమగ్రమైన అధ్యయనం చేసి, పూర్తి స్థాయి నివేదికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ప్రాజెక్టు వారీగా లోతైన విశ్లేషణలు జరగాలనే దిశగా సూచనలు జారీ చేశారు. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఇటీవల పంపిన 'కాంప్రహెన్సివ్ డ్యామ్ సేఫ్టీ ఎవల్యూషన్' లేఖపై సీఎం రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కేంద్ర మంత్రి లేఖలో ప్రస్తావించిన అంశాలపై అధికారులు సమగ్రంగా విశ్లేషణ జరిపి, రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల స్థితిగతులపై స్టేటస్ రిపోర్ట్‌లు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల ప్రస్తుత పరిస్థితిపై సమీక్ష జరిగింది. వీటి మరమ్మత్తులకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసి, సంబంధిత ఏజెన్సీలకే పూర్తి బాధ్యత అప్పగించాలని సీఎం ఆదేశించారు. అలాగే, ప్రాజెక్టుల వారీగా సిద్ధం చేసే నివేదికల ఆధారంగా తదుపరి చర్యలపై నవంబర్ రెండో వారంలో మరోసారి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు సీఎం ప్రకటించారు.

అదనంగా, తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు 80 టీఎంసీల నీటిని తరలించేందుకు వీలుగా ప్రాజెక్టు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. తుమ్మిడిహట్టి వద్ద చేపట్టాల్సిన కొత్త ప్రాజెక్టుపై కూడా సమావేశంలో చర్చించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సాగునీరు, తాగునీటి అవసరాలను తీర్చేలా ఈ ప్రణాళికలు రూపొందించాలని సీఎం ఆదేశించారు. పాత పనులను వినియోగించుకుంటూ ముందుకు వెళ్లేలా అంచనాలను సిద్ధం చేయాలని సూచించారు. సుందిళ్ల బ్యారేజీని మరమ్మత్తు చేసి వినియోగంలోకి తీసుకువచ్చి, శ్రీపాద ఎల్లంపల్లికి నీరు తరలించేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలు వెంటనే సిద్ధం చేయాలని కూడా సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

## సినీ కార్మికుల పిల్లల కోసం కార్పొరేట్ స్కూల్



- హైదరాబాద్‌ను ప్రపంచ సినీ పరిశ్రమకు వేదికగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- సీఎం రేవంత్‌రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

యూసుఫ్‌గూడలో సినీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన అభినందన సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సినీ కార్మికుల సంక్షేమం కోసం పలు ముఖ్య నిర్ణయాలను ప్రకటించారు.

"కృష్ణానగర్‌లో ఒక మంచి స్థలాన్ని గుర్తించండి. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు కార్పొరేట్ స్థాయిలో స్కూల్ నిర్మించి, సినీ కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్య అందించే బాధ్యత నేను తీసుకుంటాను" అని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఆరోగ్య సమస్యల విషయంలో కార్మికులకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత వైద్య సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. అదేవిధంగా సినీ కార్మికుల సంక్షేమ నిధి ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తూ, ఆ నిధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.10 కోట్లు మంజూరు చేస్తామని తెలిపారు.

భవిష్యత్తులో టికెట్ల ధరలు పెంచుకునే సందర్భంలో, అదనపు ఆదాయంలో 20 శాతం సినీ కార్మికుల వెల్ఫేర్ ఫండ్‌కి కేటాయించేలా నిబంధనలు సడలిస్తామని ప్రకటించారు. "రాత్రి పగలు తేడా లేకుండా కష్టపడే సినీ శ్రామికుల శ్రమ, త్యాగం నాకు తెలుసు. తెలుగు సినిమాను ఆస్కార్ స్థాయికి తీసుకెళ్లడం వెనుక మీ కష్టమే ఉంది. గతంలో నిలిపివేసిన నంది అవార్డుల స్థానంలో ఇప్పుడు 'ప్రజా యుద్ధ నౌక గద్దర్ అవార్డులు' అందిస్తున్నాం" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అదే సమయంలో, 'హైదరాబాద్‌ను ప్రపంచ సినీ పరిశ్రమకు వేదికగా తీర్చిదిద్దడం' ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. "తెలంగాణ రైజింగ్%–%2047 ప్రణాళికలో ఫిల్మ్ ఇండస్ట్రీకి ప్రత్యేక చాప్టర్ ఉంటుంది," అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# కేంద్ర ఉద్యోగులకు శుభవార్త

**8వ వేతన సంఘం ఏర్పాటు**

**50 లక్షల మంది ఉద్యోగులు, 69 లక్షల మంది పింఛనుదారులకు లాభం**



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మోదీ సర్కార్ శుభవార్త తెలిపింది. 8వ వేతన సంఘం ఏర్పాటు చేయాలని మంగళవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో నిర్ణయించింది. ఈ కమిషన్ సిఫార్సులతో సుమారు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 69 లక్షల మంది పింఛనుదారులు ప్రయోజనం పొందనున్నారు. ఈ కమిషన్‌కు సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజన్ ప్రకాశ్ దేశాయ్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు. ఐఐఎం బెంగళూరు ప్రొఫెసర్ పాలుక్ ఘోష్ తాత్కాలిక సభ్యుడిగా, పెట్రోలియం కార్యదర్శి పంకజ్ జైన్ సభ్య కార్యదర్శిగా నియమితులయ్యారు. కమిషన్ 18 నెలల్లోపు నివేదికను సమర్పించనుంది.

**2026 నుంచి 8వ వేతన సవరణ**

7వ వేతన సంఘం 2014 ఫిబ్రవరిలో ఏర్పడి, దాని సిఫార్సులు 2016 జనవరి నుంచి అమలయ్యాయి. ఆ కమిషన్ అమలుకాలం 2026తో ముగియనుండగా, తాజాగా మోదీ సర్కార్ 8వ కమిషన్ ఏర్పాటుతో కొత్త వేతన సవరణకు దారితీసింది. కేంద్ర ప్రభుత్వ వర్గాల ప్రకారం, 2026 జనవరి 1 నుంచి కొత్త వేతనాలు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.

ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తుంది. దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారుల వేతనాలు, భత్యాలు, పెన్షన్లు ఎంత ఉండాలో ఈ సంఘం సిఫార్సులు చేస్తుంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని జీతాలు, పింఛన్ల పెంపుపై నివేదిక సమర్పిస్తుంది. ఆ నివేదిక ఆధారంగా ప్రభుత్వం వేతన సవరణలు, అలవెన్సులు నిర్ణయిస్తుంది.

కేంద్ర కేబినెట్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. 2025%–%26 రబీ సీజన్ కోసం ఫాస్ఫేట్ అండ్ పొటాషియం ఎరువులపై సబ్సిడీ రేట్లను నిర్ణయిస్తూ రూ. 37,952 కోట్ల ఎరువుల రాయితీకి ఆమోదం తెలిపింది. ఈ సబ్సిడీ 2025 ఖరీఫ్ సీజన్ కంటే రూ.736 కోట్లు ఎక్కువ అని సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాష్, సల్ఫర్ వంటి ఎరువులపై రైతులకు సబ్సిడీ రేట్లు అమలు చేస్తామని తెలిపారు. ఈ నిర్ణయం వల్ల రైతులు సబ్సిడీతో సరసమైన ధరలకు ఎరువులు పొందగలుగుతారు. "ఎరువుల ధరలు స్థిరంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది" అని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

# భారత్‌లోనే విమానం తయారీకి శ్రీకారం

**రష్యా సహకారంతో ఎస్‌జే-100 విమానాలను హిందుస్థాన్ ఏరోనాటిక్స్ తయారు**



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

భారత్–రష్యా వ్యూహాత్మక భాగస్వామ్యం మరో కొత్త దిశలో బలపడింది. దేశంలోనే పూర్తి స్థాయి ప్రయాణికుల విమానం తయారీకి భారత్ సిద్ధమైంది. రెండు ఇంజిన్లు కలిగిన ఎస్‌జే–100 విమానాలను హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తయారు చేయనుంది. ఈ మేరకు హెచ్ఏఎల్, రష్యాకు చెందిన ప్రభుత్వరంగ సంస్థ యునైటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది.

ఈ ఒప్పందం దేశీయ విమాన తయారీ రంగంలో చరిత్రాత్మక అడుగుగా నిలవనుంది. ఇది స్వతంత్ర భారతదేశంలో మొదటి పౌర విమాన తయారీ ప్రాజెక్టుగా భావిస్తున్నారు. గతంలో 1961లో హెచ్ఏఎల్ తయారుచేసిన ఏవీఆర్‌వో హెచ్ఎస్–748 విమానాలు ప్రధానంగా వాయుసేన ఉపయోగం కోసం మాత్రమే ఉండేవి. ఆ ప్రాజెక్టు 1988లో ముగిసిన తర్వాత, ఇది మరోసారి పౌర విమాన తయారీలో హెచ్ఏఎల్‌కి కొత్త అధ్యాయంగా నిలుస్తోంది.

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉడాన్ పథకానికి ఈ విమానాల తయారీ గేమ్ ఛేంజర్ కానుందని హెచ్ఏఎల్ పేర్కొంది. దేశవ్యాప్తంగా చిన్న, మధ్యస్థ దూర ప్రయాణాలకు అనుకూలంగా ఉండే ఎస్‌జే%–%100 విమానాలు భారతీయ విమానయాన రంగంలో విప్లవాత్మక మార్పు తీసుకురానున్నాయి.

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ ప్రతినిధులు మాట్లాడుతూ ం "ఈ ప్రాజెక్టు ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేస్తుంది. దేశీయ తయారీని బలోపేతం చేయడంతో పాటు, విమానయాన రంగంలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయి" అన్నారు.


హెచ్ఏఎల్ అంచనాల ప్రకారం,

వచ్చే 10 సంవత్సరాల్లో దేశీయంగా 200 ఎస్‌జే – 100 విమానాలు అవసరం కానున్నాయి. అలాగే హిందూ మహాసముద్ర ప్రాంతంలో పర్యాటక అవసరాల కోసం 350 విమానాల వరకు డిమాండ్ ఉంటుందని తెలిపింది.

ఇప్పటికే రష్యా యునైటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ లిమిటెడ్ సుమారు 200 ఎస్‌జే–100 విమానాలు తయారు చేసింది. ప్రపంచవ్యాప్తంగా 16 ఎయిర్‌లైన్స్ ఈ మోడల్ విమానాలను వినియోగిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్ ద్వారా భారతదేశం విమాన భాగాల తయారీ నుంచి పూర్తి స్థాయి కమర్షియల్ ఎయిర్‌క్రాఫ్ట్ మాన్యుఫాక్చరింగ్ నేషన్ దిశగా అడుగేస్తోంది. విమానాల రూపకల్పన, ఇంజినీరింగ్, టెస్టింగ్ రంగాల్లో రష్యా సాంకేతిక పరిజ్ఞానం, భారతీయ నైపుణ్యం కలయికతో దేశీయ ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరగనుంది.

# తెలంగాణపైనా తుఫాన్ ప్రభావం

- 500కిపైగా ప్రాంతాల్లో వర్షపాతం నమోదు
- భారీ నుంచి అతి భారీ వర్ష సూచన
- పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మొంథా తుపాన్ ఎఫెక్ట్ తెలంగాణపైనా కనిపిస్తోంది. మంగళవారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రాష్ట్రంలో 508 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. వికారాబాద్, నాగర్‌కర్నూల్, నల్లగొండ, సంగారెడ్డి, కామారెడ్డి, రంగారెడ్డి, గద్వాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం పడింది. మిగతా ప్రాంతాల్లో తేలికపాటి వాన కురిసింది. బుధవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే సూచనలున్నాయని వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న హెచ్చరించారు. ఈ మేరకు ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేశారు. కొమ్రంభీం అసిఫాబాద్, నిజామాబాద్, రాజన్నసిరిసిల్ల, హన్మకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, నిజామాబాద్, సూర్యాపేట, నల్లగొండ, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ కామారెడ్డి జిల్లాలు ఎల్లో హెచ్చరిక జాబితాలో ఉన్నాయి. ఆ జిల్లాలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో కూడిన గాలులు వీస్తాయనీ, ఉరుములు, మెరుపులతో వర్షాలు పలుచోట్ల పడుతాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ నెల 30న రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి వర్షం, 31న భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని తెలిపింది.



## లొంగిపోయిన మావోయిస్టు నేత బండి ప్రకాశ్

- పుల్లూరి ప్రసాదరావు కూడా..
- డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో ఆయుధాలు అప్పగింత

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మావోయిస్టు పార్టీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. ఆ పార్టీ కీలక నేత, తెలంగాణ స్టేట్ కమిటీ మెంబర్ బండి ప్రకాశ్‌తో పాటు మరో సెంట్రల్ కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ శంకరన్న, చంద్రన్న డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉన్న బండి ప్రకాశ్ ... మావోయిస్టు పార్టీలో 45 ఏండ్లు వివిధ స్థాయిలో పనిచేశారు. ప్రభాత్ అనే పేరుతో ప్రెస్‌టీమ్ ఇన్‌చార్జిగా కూడా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. పోలీసుల ఎదుట లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలిసిపోయిన మావోయిస్టులపై ఎలాంటి చర్యలు ఉండవని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు.

# హరీశ్‌రావుకు పితృ వియోగం

- అనారోగ్యంతో తన్నీరు సత్యనారాయణ కన్నుమూత
- సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కేటీఆర్, బీఆర్ఎస్ శ్రేణుల నివాళి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన భౌతిక కాయానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివాళులర్పించారు. తన బావతో ఉన్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సమాచారం తెలిసిన వెంటనే కేసీఆర్ హరీశ్‌రావుకు ఫోన్ చేసి కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. సత్యనారాయణ పార్థివ దేహాన్ని అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు, ఇతర ప్రముఖుల సందర్శనార్థం హైదరాబాద్ కోకాపేటలోని క్రిన్స్‌విల్లాస్‌లో ఉంచారు. మంగళవారం మధ్యాహ్నం ఫిల్మ్‌నగర్‌లోని మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

**సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం**

తన్నీరు సత్యనారాయణ మృతిపట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. హరీశ్‌రావు కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ ఈటల రాజేందర్, పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ సత్యనారాయణ భౌతిక కాయానికి నివాళులర్పించారు. హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణ రావు మరణం పట్ల సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క వేర్వేరు ప్రకటనల్లో సంతాపం ప్రకటించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు, పలువురు బీఆర్ఎస్ నేతలు, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేశారు.

## అంగన్వాడీ నియామకాల ప్రక్రియ వేగవంతం




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో అంగన్వాడీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. నియామకాలకు ఆటంకంగా ఉన్న సుప్రీం కోర్టు స్టేను వెకేట్ చేయించేందుకు తగిన చర్యలు వెంటనే చేపట్టాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో లా సెక్రటరీ బీ. పాపిరెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్, పీఆర్సీ చైర్మెన్ ఎన్. శివశంకర్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజాతో మంత్రి సీతక్క సమావేశం నిర్వహించారు. అంగన్వాడీల నియామకాల్లో ఎదురవుతున్న న్యాయ చిక్కులపై చర్చించారు. న్యాయ చిక్కులను అధిగమించే దిశలో వారి సలహాలు, సూచనలు స్వీకరించారు. రాష్ట్రంలో సుమారు 14 వేల వరకు అంగన్వాడీ ఖాళీలుండగా వాటి భర్తీపై గతంలో ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసిన సంగతి తెలిసిందే. ఏజెన్సీ ప్రాంతాల్లో టీచర్, హెల్పర్ పోస్టులను ఎస్టీలకు రిజర్వ్ చేసిన ప్రభుత్వం, చిన్నారులు తమ మాతృభాషలో నేర్చుకోవడం సులువవుతుందన్న ఉద్దేశంతో ఆ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ రిజర్వేషన్లు 50 శాతం మించిపోవడంతో, కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో సుప్రీం కోర్టు స్టే విధించింది. ఈ నేపథ్యంలో స్టేను వెకేట్ చేయించేందుకు తగిన చర్యలు తీసుకోవాలనీ, ఆ దిశగా లా సెక్రటరీ పాపిరెడ్డికి మంత్రి సీతక్క సూచించారు. రిక్రూట్‌మెంట్, సర్వీస్ రూల్స్‌లో నిపుణుడైన ఎన్. శివశంకర్ సలహాలతో ముందుకు వెళ్లాలని మంత్రి ఆదేశించారు. ఇప్పటికే కర్నాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు పర్యటించి అంగన్వాడీ రిక్రూట్‌మెంట్ విధానాన్ని అధ్యయనం చేసి నివేదిక సమర్పించారు. ఆ రాష్ట్రాల్లో అంగన్వాడీ పోస్టులు ప్రభుత్వ సర్వీస్ కిందకు రాకపోవడం వలన సబార్డినేట్ సర్వీస్ రూల్స్ వర్తించవనీ, దీంతో రిజర్వేషన్లు 50 శాతం పరిమితి వర్తించదని అధికారులు వివరించారు.

పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఏజెన్సీ ప్రాంతాల్లో అంగన్వాడీ పోస్టులు ఎస్టీలకే రిజర్వ్ చేసిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనికి అనుగుణంగా తెలంగాణలోనూ అదే విధానాన్ని అవలంబించి సుప్రీం కోర్టు స్టేను వెకేట్ చేయించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. పది రోజుల్లో నియామక ప్రక్రియకు మార్గం సుగమం చేయాలన్నారు. అంగన్వాడీ సేవలను మరింత బలోపేతం చేసే దిశలో కొత్త నియామకాలు దోహద పడుతాయని ఆకాంక్షించారు. అందుకే అంగన్వాడీల నియామకాలను సత్వరం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## బిహార్ యువత ఆకాంక్షల గొంతు నొక్కేసిన మోడీ-నీతీశ్ ప్రభుత్వం

- కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బిహార్ యువత ఆకాంక్షల గొంతును మోడీ నితీశ్ ప్రభుత్వం నొక్కేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు. మోదీ–నీతీశ్ ప్రభుత్వం ప్రతి అభివృద్ధి సూచికలోనూ రాష్ట్రాన్ని వెనక్కి నెట్టేసిందని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో మార్పు కోసం సమయం ఆసన్నమైందని, న్యాయం కోసం మహాగఠ్‌బంధన్‌ను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఇటీవల బిహార్ యువతతో విద్య, వైద్యం, ఉపాధి వంటి అంశాలపై తనకు జరిగిన చర్చను రాహుల్ ఎక్స్‌లో వీడియో రూపంలో పంచుకున్నారు. రాష్ట్రంలోని అన్ని రంగాల్లో దయనీయ పరిస్థితికి బీజేపీ–జేడీయూ నేతృత్వంలోని ప్రభుత్వం పూర్తిగా బాధ్యత వహించాలంటూ ఆయన వ్యాఖ్యానించారు. "గత 20 ఏళ్లుగా మోదీ–నీతీశ్ ప్రభుత్వం యువత ఆకాంక్షలను అణచివేసింది. బిహార్ విద్యా రంగంలో 9, 10 తరగతుల డ్రాప్‌అవుట్ రేటులో 29 రాష్ట్రాల్లో 27వ స్థానంలో ఉంది. 11, 12 తరగతుల్లో నమోదు రేటులో 28వ స్థానం, మహిళా అక్షరాస్యతలో కూడా 28వ స్థానం ఉంది. ఉపాధి, పరిశ్రమల రంగాల్లో వరుసగా 21, 23 స్థానాల్లో ఉంది. శిశు మరణాలు, ఆరోగ్య బీమా కవరేజీలో 27వ స్థానం, గృహాల్లో మరుగుదొడ్ల అందుబాటులో 29వ స్థానం, మానవ అభివృద్ధి సూచికలో 27వ స్థానం, తలసరి ఆదాయంలో 25వ స్థానంలో ఉంది. ఇవి కేవలం సంఖ్యలు మాత్రమే కాదు, 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం బిహార్‌ను ఎంత వెనక్కి లాగిందో చూపించే అద్దం లాంటివి," అని రాహుల్ పేర్కొన్నారు. "నేను కలిసిన బిహారీ యువత చాలా ప్రతిభావంతులు, తెలివైనవారు. వారు కృషితో ఎక్కడైనా రాణించగలరు. కానీ ప్రభుత్వం వారికి అవకాశాల బదులుగా నిరుద్యోగం, నిరాశలను ఇచ్చింది. ఇప్పుడు మార్పు అవసరం ఉంది. బిహార్ గౌరవాన్ని తిరిగి తెచ్చే సమయం వచ్చింది," అని ఆయన తెలిపారు. ఢిల్లీలో చదువుతున్న బిహార్ విద్యార్థులతో రాహుల్ గాంధీ సమావేశమయ్యారు. రాష్ట్రంలోని విద్యా సంస్థల దుస్థితిని వారు వివరించారు. 'బిహారీ' అనే పదాన్ని విశ్వవిద్యాలయాల్లో అవమానంగా వాడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు బిహార్ అసెంబ్లీకి 243 స్థానాలపై ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగగా, నవంబర్ 14న ఫలితాలు వెలువడనున్నాయి.

## శంకరమఠ్‌ను సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నల్లకుంటలోని శంకరమఠంలో గణపతి, శారదాంబ, చంద్రమౌళీశ్వర స్వామి, ఆదిశంకరాచార్యుల ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శంకరమఠంలో శృంగేరి శారదా పీఠం జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీతీర్థ మహాస్వామి వారిని మర్యాద పూర్వకంగా కలిశారు. "ధర్మ విజయ యాత్ర" లో భాగంగా హైదరాబాద్‌కు విచ్చేసిన శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీస్వామి వారికి ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వేములవాడ ఆలయ అభివృద్ధి వివరాలను తెలియజేశారు. ముఖ్యమంత్రి వెంట ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఉన్నారు.

## విజిలెన్స్ వారోత్సవాల గోడ పత్రికావిష్కరణ

- **ప్రతిజ్ఞ చేయించిన ఇంచార్జి కలెక్టర్..**
- **జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా, రాజన్న సిరిసిల్ల జిల్లాలో మంగళవారం 28.10.2025 రోజున కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ శిఖా గోయల్ ఆదేశాల మేరకు, జిల్లా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ వారోత్సవాల గోడ పత్రికను ఆవిష్కరించారు. జిల్లా అధికారులు మరియు సిబ్బందితో గరిమ అగ్రవాల్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. ఉద్యోగులు మరియు అధికారులు తమ విధి నిర్వహణలో అత్యంత జాగ్రత్తతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, తద్వారా ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. నిబద్ధతతో పనిచేస్తూ, అవినీతి మరియు అక్రమాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ విజయ్ శంకర్, ఇన్స్పెక్టర్ ప్రశాంత్ రావు, డీఆర్డీఓ శేషాద్రి, అటవీశాఖ అధికారులు మరియు విజిలెన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల లక్ష్యాలపై దృష్టి సారించండి..

- **డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత సూచన**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. రజిత అధ్యక్షతన జిల్లాలోని మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లకు ఒక సమీక్ష సమావేశం ఏర్పాటు చేయబడింది. ఈ సమావేశంలో డాక్టర్ రజిత మాట్లాడుతూ.. జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలో ఆరోగ్య పథకాల అమలును పర్యవేక్షించి, నిర్దేశించిన లక్ష్యాలను తప్పక సాధించాలని స్పష్టం చేశారు. అలాగే, విధులలో సమయపాలన పాటించడం అత్యంత ముఖ్యమని ఆమె నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లకు తీసుకోవాల్సిన చర్యలపై ఆమె దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పి.ఓ. ఎం.హెచ్.ఎన్. డాక్టర్ అంజలి, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ అనిత, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సంపత్ కుమార్ గారు మరియు %మీూవూ%లు, టీబీ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## రానున్న అకాల వర్షాలకు రైతులు జాగ్రత్త వహించాలి

- **తహసీల్దార్ జయంత్**



**బలగం టీవీ, తంగళ్లపల్లి:**

రాబోయే 3 రోజులు తుపాన్ కారణంగా భారీ నుండి అతి భారీ వర్షాలు ఉన్నందున తంగళ్ళపల్లి మండలం లోని రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా తాహసిల్దార్ జయంతి కుమార్ తెలిపారు. ఇప్పటికే కొనుగులు చేసిన ధాన్యంను సెంటర్లు వారికి కేటాయించిన రైసుమిల్లులకు వెంటనే తరలించాలని,సెంటర్ కు వచ్చిన ధాన్యం ను కుప్పలుగా చేసి టార్పాలిన్ కవర్లతో కప్పివుంచి వర్షానికి తడవకుండా జాగ్రత్తలు తీసుకోవలన్నారు. రాబోయే 3 రోజులు వర్షాలు ఉన్నందున వర్షాలు తగ్గే వరకు రైతులు హార్వెస్టర్ కోతలు వెంటనే నిలిపివేయగలరని కావున రైతులు తగు జాగ్రత్త లు పాటించి పంట నష్టం కాకుండా అధికారుల కు సహకరించగలరని కోరారు.

## పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ గడువు పొడిగింపు..

- **అర్హులైన విద్యార్థులకు డిసెంబర్ 31 వరకు అవకాశం**
- **రాజన్న సిరిసిల్ల జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ప్రకటన**
- **జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి ఎం.ఎ. భారతి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తెలంగాణ రాష్ట్ర మైనారిటీల సంక్షేమ శాఖ కమిషనర్ సమాచారం మేరకు, విద్యా సంవత్సరం 2025–26 కి సంబంధించిన పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ ఆన్‌లైన్ నమోదు గడువును డిసెంబర్ 31, 2025 వరకు పొడిగించినట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి ఎం.ఎ. భారతి ఈరోజు (28.10.2025) ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ కాస్ట్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఈ గడువు పొడిగింపు జరిగిందని ఆమె పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులందరికీ స్కాలర్‌షిప్ పొందే అవకాశం కల్పించడమే ఈ పొడిగింపు ముఖ్య ఉద్దేశమని ఆమె స్పష్టం చేశారు. అన్ని కళాశాలలు, విశ్వవిద్యాలయాల నిర్వాహకులు, విద్యార్థులు వెంటనే e-PASS వెబ్‌సైట్ https://telanganaepass.cgg.gov.in ద్వారా తమ స్కాలర్‌షిప్ దరఖాస్తులను (ఫ్రెష్ మరియు రీన్యువల్ రెండూ) సమర్పించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులకు అవగాహన కల్పించి, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తి చేయడంలో అన్ని విద్యా సంస్థల ప్రిన్సిపాళ్ళు సహకరించాలని జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి కోరారు. మరిన్ని వివరాల కోసం జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించవచ్చు.

## రైస్ మిల్లర్లు గడువులోగా సీఎంఆర్ ఇవ్వాలి..

- **కొనుగోలు కేంద్రాల ధాన్యం ఎప్పటికప్పుడు తీసుకోవాలి.**
- **ఇంచార్జ్ కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఖరీఫ్ సీజన్ కు సంబంధించి కొనుగోలు కేంద్రాలను ట్యాగ్ చేసిన మిల్లర్లు ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తీసుకోవాలని ఇంచార్జ్ కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. మంగళవారం ఖరీఫ్ సీజన్ ధాన్యం, పత్తి, మొక్కజొన్న తదితర పంట ఉత్పత్తుల కొనుగోలు ఇతర అంశాలపై జిల్లాలోని రా, బాయిల్డ్ రైస్ మిల్లర్లు, జిన్నింగ్ మిల్లర్లు వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయంలోని ఆడిటోరియంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ట్యాగ్ చేసిన మిల్లర్లు రైస్ మిల్లర్లు ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దించుకొని ఇబ్బందులు లేకుండా చూడాలని, కావాల్సిన హమాలీలను సిద్ధంగా ఉంచుకోవాలని, ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. బ్యాంకు గ్యారంటీ, అగ్రిమెంట్లు రెండు రోజుల్లోగా అందజేయాలని,2024- 25 ఖరీఫ్, యాసంగి సీజన్ సంబంధించిన సీఎంఆర్ గడువులోగా



అందించాలని ఆదేశించారు. మిల్లులోని గన్ని సంచులను ఆయా కొనుగోలు కేంద్రాలకు వెంటనే తరలించాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రైస్ మిల్లర్లు ముందుకు వెళ్లాలని, వాటిని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని,రైస్ మిల్లర్ల ఇబ్బందులను పౌరసరఫరాల శాఖ దృష్టికి తీసుకెళ్తామని పరిష్కరించిన కృషి చేస్తామని స్పష్టం చేశారు.

**జిన్నింగ్ మిల్లులో మిల్లుల్లో వసతులు కల్పించాలి..**

జిల్లాలోని ఐదు సీసీఐ కొనుగోలు కేంద్రాలైన జిన్ను మిల్లుల వద్ద పత్తి రైతులకు కనీస వసతులు కల్పించాలని ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. ఆయా కొనుగోలు కేంద్రాల వద్ద మద్దతు ధర, కపాస్ కిసాన్ అప్లికేషన్లో స్లాట్ బుకింగ్ తదితర అంశాలు తెలిపేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తూనికలు కొలతలు శాఖ వారి ఆమోదించిన కాంటాలను వినియోగించాలని, అగ్నిమాపక శాఖ నుంచి అనుమతులు పొందాలని ఆదేశించారు. జిల్లాలోని 29 వేల మంది రైతులు కపాస్ కిసాన్ లో వివరాలు నమోదు చేసుకున్నారని సీసీఐ అధికారులు ఇంచార్జి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు రెండు ఏర్పాటు చేశామని ఆయా ప్రాంతాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ సూచించారు సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ శేషాద్రి, డీసీఎస్ఓ చంద్ర ప్రకాశ్, డీఏఓ అఫ్జల్ బేగం, డీసీఓ రామకృష్ణ, మెప్మా ఏఓ మీర్జా ఫసహత్ అలీ బేగ్, మార్కెటింగ్ శాఖ అధికారి ప్రకాష్, మార్క్‌ఫెడ్ అధికారి హబీబ్, సీసీఐ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సరైన తేమ శాతం వచ్చిన ధాన్యం కొనుగోలు చేయాలి..

**ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని,సరైన తేమ శాతం 17 వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని మెప్మా ఆద్వర్యంలో ముష్టిపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంత వరకు ఎంత ధాన్యం వచ్చింది? ఎంత కొనుగోలు చేశారో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా టెంట్, నీటి, విద్యుత్ సరఫరా వసతి కల్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడా చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ఇంకా వరి



కోతలు మొదలు పెట్టని రైతులు రెండు రోజుల పాటు వాయిదా వేసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, సిరిసిల్ల తహసిల్దార్ మహేష్ కుమార్, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

**బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి..**

వైద్యులు రోగులకు చిత్తశుద్ధితో వైద్య సేవలు అందించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఇంచార్జి కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు చిత్తశుద్ధితో సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి ఆదేశించారు. రోగులకు మెరుగైన, సంతృప్తికరమైన వైద్య సేవలు అందించడం వైద్యుల ప్రథమ కర్తవ్యంగా భావించాలనిఅన్నారు. శిబిరానికి వచ్చే వారి కోసం గదిలో మౌలిక వసతులు కల్పించాలని, ఫర్నిచర్ ఇతర ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దివ్యాంగులకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జీ జీ హెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్, డీఆర్డీఓ శేషాద్రి, వైద్యులు సంతోష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, డీపీఎం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు విరాహత్ అలీ క్షమాపణ చెప్పాలి..

- **ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి..**
- **టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్**

**బలగం టీవీ, హైదరాబాద్:**

హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఎన్నికల ఫలితాల తర్వాత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయి సహచర జర్నలిస్టులను ఉద్దేశించి టియుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) తీవ్రంగా ఖండించింది. ఒక జర్నలిస్టు యూనియన్ కు అధ్యక్షుడుగా ఉండి తోటి జర్నలిస్టులను విషసర్పాలని, బుడ్డర్ ఖాన్ లని, కొన్ని జర్నలిస్టు సంఘాలను బుడ్డ సంఘాలు అంటూ కించపర్చడం, దూషించడం, తూలనాడడం సరైంది కాదని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, వల్లాల జగన్, బండి విజయకుమార్, రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ తదితరులు పేర్కొన్నారు. విషసర్పాలన్నీ ఏకమైనా తమను ఏమీ చేయలేకపోయాయంటూ సోషల్ మీడియాలో తెగ రెచ్చిపోయి పోస్టులు పెట్టడం జర్నలిస్టులను బాధించిందని అన్నారు.ప్రెస్ క్లబ్ ఎన్నికల సందర్భంగా గెలుపు లక్ష్యంగా అందరూ అవగాహనతో లేదా కూటమిగా ఏర్పడి పోటీ చేయడం సర్వసాధారణం. అలాంటి పరిస్థితుల్లో ప్యానెల్ లో పోటీ చేసినా,స్వతంత్రంగా పోటీ చేసినా గెలుపు ఓటములు సహజమని, అంతమాత్రాన ఓడిపోయిన జర్నలిస్టులను ఉద్దేశించి విరాహత్ అలీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సహించరానిదని వారన్నారు. విరాహత్ అలీ తన వ్యాఖ్యలను వెంటనే



ఉపసంహరించుకోవాలని, సహచర జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ వల్ల జర్నలిస్టులకు ఒరిగిందేమిటో, జర్నలిస్టుల సంక్షేమానికి ఏం చేశారో చెప్పకుండా ఎన్నికల పేరుతో ఒక వర్గం, ఒక యూనియన్ పెత్తనంతో క్లబ్ ను తమ కబంధహస్తాల్లో పెట్టుకొని ఆటాడుతున్నారని ధ్వజమెత్తారు. మంచి వాతావరణంలో జరగాల్సిన ప్రెస్ క్లబ్ ఎన్నికలను గందరగోళం చేసి లక్షల రూపాయలు ఖర్చు పెట్టి రాజకీయం చేయడం, సభ్యులను తప్పుదోవ పట్టించడం బాధాకరమని అన్నారు. ఆదివారం జరిగిన ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు, అదేవిధంగా ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఎన్నికల్లో పోటీ చేసి గట్టి పోటీ ఇచ్చిన అభ్యర్థులకు వారు అభినందనలు తెలిపారు. గెలుపొందిన నూతన కార్యవర్గం రాబోయే రెండేళ్లలో ఏ ఒక్క రాజకీయ పార్టీకి, యూనియన్ లకు తలొగ్గకుండా ప్రెస్ క్లబ్ అభివృద్ధికి, సభ్యుల సంక్షేమాని కృషి చేయాలని వారు కోరారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం..

- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే
- అమరవీరుల త్యాగాలకు

**నివాళిగా మెగా రక్తదాన శిబిరం..**




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

అమరవీరుల వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని కల్యాణ లక్ష్మీ గార్డెన్స్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్పీ శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించి, స్వయంగా రక్తదానం చేసి యువతను, ప్రజలను ప్రోత్సహించారు. రక్తదానం చేసిన వారికి ఆయన ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ.. రక్తదానం ప్రాణదానంతో సమానం అని, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి జీవితాలను కాపాడడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని నొక్కి చెప్పారు. అమరవీరుల త్యాగాలను సమాజం ఎప్పటికీ మరువదని, వారి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిబిరంలో యువత, ప్రజలు, ఆటో డ్రైవర్లు, పోలీస్ అధికారులు, సిబ్బందితో సహా సుమారు 460 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమని ఆయన కొనియాడారు. పోలీసులు కేవలం శాంతి భద్రతల పరిరక్షణకే కాకుండా, సేవా కార్యక్రమాలలో కూడా ముందుంటారని తెలిపారు. రక్తదానంపై ఉన్న ఆపోహలను నమ్మకుండా ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మనం చేసే రక్తదానం అత్యవసర సమయాల్లో, ప్రమాద సమయాల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి, అలాగే తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సి.ఐ లు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, మధుకర్, నటేష్, ఆర్.ఐ లు మధుకర్, రమేష్, యాదగిరి, ఎస్.ఐ లు, డాక్టర్ సంధ్యారాణి, కరీంనగర్, సిరిసిల్ల, నిజామాబాద్ జిల్లాకు చెందిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు గుడ్ల రవి, పెండ్యాల కేశవరెడ్డి, బుస్స ఆంజనేయులు), అలాగే కరీంనగర్, సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# వేములవాడలో కోటిలింగాల తరలింపుపై బీజేపీ అభ్యంతరం



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ గరీమా అగ్రవాల్ (VTA.D.A వైస్ ఛైర్మన్) కోటిలింగాలను తరలించే ప్రయత్నం చేయడంపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆలయ అభివృద్ధిలో భాగంగా కోటిలింగాలను తరలించే క్రమంలో, వాటితో పాటు ఆలయ ప్రాంగణంలో ఉన్న ఇతర మతస్తుల నిర్మాణాలను (దర్గా) తరలించకుండా కేవలం హిందూ దేవాలయానికి సంబంధించిన కోటిలింగాలను మాత్రమే తొలగించడానికి ప్రయత్నించడం హిందువుల మనోభావాలను దెబ్బతీసే చర్య అని, ఆలయ అధికారుల వైఖరి పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, ముందుగా దర్గాను తొలగించిన తర్వాతే కోటిలింగాల తరలింపుతో సహా ఏ అభివృద్ధి కార్యక్రమాన్నైనా చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతి రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బండ మల్లేశం, సంతోష్ రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు రాగుల రాజు రెడ్డి, జిల్లా కార్యదర్శి గొప్పడి సురేందర్రావు, జిల్లా మీడియా కన్వీనర్ కాసుగంటి రాజు రావు, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్, వివిధ మండలాల అధ్యక్షులు వేణుగోపాలరావు, కోడె రమేష్, మీరాల్కర్, బాలాజీ, రాపెల్లి శ్రీధర్, బురుగుపల్లి పరమేష్, సొల క్రాంతి, మరియు బీజేపీ సీనియర్ నాయకులు గజ బింకర్ చందు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు

- చివరి గింజ వరకు కొంటాం..
- మార్కెట్ కమిటీ ఛైర్మన్ రొండి రాజు, వైస్ ఛైర్మన్ కనికరపు రాకేష్
- వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**బలగం టీవీ, వేములవాడ**

సోమవారం రోజున వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామంలో ఐకెపి సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ ఛైర్మన్ రొండి రాజు, వైస్ ఛైర్మన్ కనికరపూ రాకేష్, డైరెక్టర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వారన్నారు వారి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా కొనుగోలు జరపాలని రైతులను వివరణ ఇబ్బంది పెడితే వెంటనే సమాచార ఇవ్వాలని ఎవరైనా అవినీతికి పాల్పడితే సహించేది లేదని వారు అన్నారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని వారు సూచించారు, ప్రభుత్వ విప్పు వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఆదేశాలతో వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్టు వారు వెల్లడించారు, చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎవరు కూడా ఆందోళన చెందవలసిన అవసరం లేదని వారు అన్నారు, రాష్ట్ర ప్రభుత్వం ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని వారన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించవలసిందిగా ప్రతి ఒక్కరిని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కనికరపూ రాకేష్, అర్బన్ మండల అధ్యక్షులు పిల్లి కనకయ్య, డైరెక్టర్లు కత్తి కనకయ్య, ధైత కుమార్, విద్యాసాగర్, మాజీ సర్పంచ్ ముడుగే చంద్రశేఖర్ యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షులు ముడిగి నరేష్ నాయకులు ఎర్రం రాజు, గుగ్గిళ్ళ సత్తయ్య, పండుగ ప్రదీప్, రాములు చంద్రయ్య, మధు, దేవరాజ్, మూదం శ్రీనివాస్, బోనాల రమేష్, దూబ్బల మల్లేశం, తాడేం శీను బొమ్మ తిరుపతి మరియు మహిళా సంఘ నాయకులు రైతులు, గ్రామ ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కురిక్యాల ఘటనపై ఎమ్మెల్యే సీరియస్..

- సంఘటనతో, ప్రత్యక్షంగా పరోక్షంగా సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే
- జిల్లా కలెక్టర్ పమేల సత్పతి, కమిషనర్ గౌస్ ఆలంతో ఫోన్లో మాట్లాడిన ఎమ్మెల్యే



**బలగం టీవీ, గంగాధర:**

గంగాధర మండల కురిక్యాల ప్రభుత్వ పాఠశాలలో యాకూబ్ పాషా అనే అటెండర్ విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సంఘటనపై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సీరియస్ అయ్యారు. జరిగిన సంఘటనపై ఆరా తీశారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో ఏడాది కాలంగా విద్యార్థునులపై వేధింపులు జరుగుతున్నా అధికారుల నిర్లక్ష్యం వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, కమిషనర్ గౌస్ ఆలం తో ఫోన్లో మాట్లాడి ఆకృత్యానికి పాల్పడిన అటెండర్ యాకూబ్ పాషా ను విధుల నుండి తొలగించాలని కోరారు. సంఘటనతో ప్రత్యక్షంగా పరోక్షంగా సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత విద్యార్థులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు.



# పోలీసు అమరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి..

- అదనపు ఎస్పీ చంద్రయ్య
- సైకిల్ ర్యాలీతో అవగాహన కార్యక్రమం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం పట్టణంలో సైకిల్ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా నుండి బతుకమ్మ ఘాట్ వరకు జరిగిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో పోలీసులు, యువత, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ.. విధి నిర్వహణలో తమ ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి భద్రతల స్థాపనకు పోలీసులు చేస్తున్న కృషి గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని ఆయన తెలిపారు. అంతేకాకుండా, పోలీస్ శాఖ మరియు ప్రజల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు.

సైకిల్ ర్యాలీలో ఇన్స్పెక్టర్లు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, మధుకర్, ఆర్.ఐలు మధుకర్, రమేష్, యాదగిరి, ఎస్.ఐలు, ఆర్.ఎస్.ఐలు, ఇతర పోలీస్ సిబ్బందితో పాటు విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు.



# యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక..

**బలగం టీవీ, సిరిసిల్ల:**

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (United Electricity Employees Union) రాజన్న సిరిసిల్ల జిల్లా CESS (Centralized Electricity Supply Scheme) నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది.

**నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ..**

| పదవి | పేరు |
|---|---|
| గౌరవ అధ్యక్షులు | ఎల్లారెడ్డి (సీఐటీయూ) |
| అధ్యక్షులు | కర్నాల అనిల్ కుమార్ |
| ఉపాధ్యక్షులు | బి. సత్యయ్య, ఎ. శ్రీనివాస్ |
| జనరల్ సెక్రెటరీ | నర్ర శ్రీనివాస్ రెడ్డి |
| డిప్యూటీ జనరల్ సెక్రెటరీ | టి. అనిల్ |
| ఆర్గనైజింగ్ సెక్రటరీ | ఎల్. కిషన్ |
| ట్రెజరీ | ఎస్. రాంబాబు |

కమిటీ సభ్యులుగా పులి సింగ్, శివప్రసాద్, ఎల్లయ్య, ఆంజనేయులు, ప్రశాంత్, సంజీవరెడ్డి, సతీష్, శ్రీహరి, వెంకటస్వామి, మల్లేష్ లు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు.

యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె. ఈశ్వర్ రావు మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలవాల స్వామి గారు ఈ వివరాలను తెలియజేశారు.

# నేటి నుంచి సెమీస్ సమరం







- **మొదటి మ్యాచ్‌లో తలపడనున్న ఇంగ్లండ్ దక్షిణాఫ్రికా జట్లు**
- **రేపు ఆస్ట్రేలియాతో భారత్ ఢీ**

**బలగం టీవీ, హైదరాబాద్**

మహిళల వన్డే ప్రపంచకప్‌లో కీలక ఘట్టం నేడు ప్రారంభం కానుంది. లీగ్ దశలో అద్భుత ప్రదర్శన కనబరిచిన ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, భారత్, దక్షిణాఫ్రికా జట్లు ఇప్పుడు సెమీఫైనల్స్‌లో తలపడనున్నాయి. ఇప్పటికే మాజీ ఛాంపియన్లైన ఆసీస్, ఇంగ్లండ్ జట్లతో పాటు తొలి కప్ కోసం ఎదురుచూస్తున్న టీమిండియా, సఫారీలు తుది పోరుకు దూసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నాయి.నాకౌట్ దశలో తిరుగులేని ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్లకు బ్రేక్ వేస్తే తప్ప ఈసారి కొత్త విజేతను చూడడం కష్టమే. కంగారూలు, ఇంగ్లీష్ జట్ల ఆధిపత్యాన్ని దెబ్బతీయాలంటే భారత, సఫారీ జట్లు సమిష్టి ప్రదర్శన కనబరచాల్సిందే.

**రికార్డుల చరిత్రతో ఆసీస్**

వరల్డ్‌కప్ అంటే చాలు ట్రోఫీని సొంతం చేసుకోవడం ఆస్ట్రేలియా జట్లకు సుపరిచితమే. పురుషులే కాదు, మహిళల జట్టు కూడా రికార్డు స్థాయిలో కప్ గెలుచుకుంది. 1978, 1982, 1988, 1997, 2005, 2013, 2022 సంవత్సరాల్లో ఎనిమిదిసార్లు విజేతగా నిలిచింది.ఇంగ్లండ్ జట్టు 1973, 1993, 2009, 2017ల్లో నాలుగుసార్లు కప్‌ను గెలుచుకుంది. ఈ రెండు జట్ల ఆధిపత్యాన్ని ఒకసారి మాత్రమే 2000లో న్యూజిలాండ్ బద్దలు కొట్టింది.ప్రస్తుత సీజన్‌లోనూ అలీసా హీలీ సారథ్యంలో ఆస్ట్రేలియా అజేయంగా సెమీస్ చేరి, తొమ్మిదోసారి టైటిల్ గెలుచుకోవాలన్న ధ్యేయంతో ముందుకు సాగుతోంది.

**ఇంగ్లండ్ ఫామ్‌లో - సఫారీలకు మరో పరీక్ష**

చివరి లీగ్ పోరులో ఓటమి తప్ప మిగతా మ్యాచ్‌ల్లో ఛాంపియన్ ఆటతో మెరిసిన ఇంగ్లండ్ జట్టు సెమీస్ బెర్తు దక్కించుకుంది. కెప్టెన్ నాట్ సీవర్-బ్రంట్, హీథర్ నైట్, అమీ జోన్స్‌ బ్యాటింగ్ ఫామ్‌తో పాటు స్పిన్నర్లు లిన్సే స్మిత్, డీన్స్, ఎకిల్‌స్టోన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఐదో కప్ వేటలో విజయం సాధించి చరిత్ర సృష్టించాలని ఇంగ్లండ్ చూస్తోంది.

సఫారీ జట్టు విషయానికొస్తే, మొదటి మ్యాచ్‌లో ఇంగ్లండ్ బౌలర్ల ధాటికి 69 పరుగులకే కుప్పకూలినా, కెప్టెన్ లారా వోల్వార్డ్ నాయకత్వంలో పుంజుకుంది. చోలే ట్రయాన్, మరినే కాప్, డీక్లెర్క్ ధాటికి, స్పిన్నర్ మ్లాబా అద్భుత బౌలింగ్‌తో వరుస విజయాలు సాధించి సెమీస్‌కు అర్హత పొందింది.అయితే చివరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా లెగ్ స్పిన్నర్ అలనా కింగ్ (7/21) బౌలింగ్ ధాటికి 97 పరుగులకే కుప్పకూలి సఫారీల విశ్వాసం దెబ్బతింది. రేపటి సెమీఫైనల్లో ఇంగ్లండ్‌పై ప్రతీకారం తీర్చుకుంటుందా? లేక మరోసారి మట్టికరిపిస్తుందా? అనేది ఆసక్తిగా మారింది.

**టీమిండియా ఆశలు ఓపెనర్లపై నమ్మకం**

భారత మహిళల జట్టు వన్డే ప్రపంచకప్ చరిత్రలో రెండుసార్లు ఫైనల్ చేరినా టైటిల్ మాత్రం అందుకోలేకపోయింది. 2005లో మిథాలీ రాజ్ సారథ్యంలో ఆసీస్ ధాటికి రన్నరప్‌గా నిలిచింది. 2017లో ఇంగ్లండ్‌పై గెలుపు అంచున నిలిచినా, చివర్లో తడబడి కప్‌ను చేజార్చుకుంది.ఈసారి స్వదేశంలో ఆతిథ్యమిచ్చిన భారత్ సెమీస్‌కు చేరింది. వరుణుడి దెబ్బకు శ్రీలంక ఆశలు చెదిరిపోయిన నేపథ్యంలో భారత్ ఆఖరి మ్యాచ్‌లో గెలుపుతో బెర్తు ఖాయం చేసుకుంది.న్యూజిలాండ్‌తో కీలక పోరులో ఓడిపోతే సెమీస్ ఆశలు గల్లంతయ్యే పరిస్థితిలో స్మృతి మంధాన, ప్రతీకా రావల్ సెంచరీలతో చెలరేగారు. జెమీమా రోడ్రిగ్స్ మెరుపు అర్ధశతకంతో భారీ స్కోరు నెలకొల్పగా, బౌలర్లు కట్టుదిట్టంగా ఆడి విజయాన్ని కైవసం చేసుకున్నారు.

తొలి సెమీ ఫైనల్లో ఇంగ్లాండ్, సౌతాఫ్రికా జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్ బుధవారం (అక్టోబర్ 29) జరుగుతుంది. రేపు గౌహతి వేదికగా బార్సపార క్రికెట్ స్టేడియంలో జరగనున్న ఈ మ్యాచ్ లో ఇంగ్లాండ్ ఫేవరేట్ గా బరిలోకి దిగుతుంది. ఈ టోర్నీలో ఇరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో ఇంగ్లాండ్ చేతిలో సౌతాఫ్రికా ఘోరంగా ఓడిపోయింది. మరో సెమీస్ లో ఇండియాతో ఆస్ట్రేలియా తలపడుతుంది. ఈ మ్యాచ్ గురువారం (అక్టోబర్ 30) జరుగుతుంది. ఈ మ్యాచ్ లో ఆస్ట్రేలియా ఫేవరేట్ గా బరిలోకి దిగుతోంది. గ్రూప్ దశలో జరిగిన మ్యాచ్ లో ఇండియాపై ఆస్ట్రేలియా ఉత్కంఠ విజయం సాధించింది. ఆదివారం (నవంబర్ 2) ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది

# నేటి నుంచి భారత్-ఆస్ట్రేలియా టీ20 సిరీస్

- **కాన్‌బెర్రాలో తొలి పోరు**

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత్-ఆస్ట్రేలియా మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ నేటి నుంచి ప్రారంభం కానుంది. కాన్‌బెర్రాలోని మానుకా ఓవల్ వేదికగా తొలి మ్యాచ్ మధ్యాహ్నం 1.45 గంటలకు మొదలవుతుంది. నవంబర్ 8 వరకు ఈ సిరీస్ కొనసాగనుంది.ఐపీఎల్‌లో సంచలనం సృష్టించిన యువ ఓపెనర్ అభిషేక్ శర్మతో పాటు ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ ఈ సిరీస్‌లో ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నారు. ఇద్దరూ సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఐపీఎల్‌లో రికార్డులు బద్దలుకొట్టి టీమిండియా%-%ఆసీస్ పోరుకు కొత్త ఉత్సాహం నింపారు.

టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ తాజాగా తన బ్యాటింగ్‌తో సంచలనాలు సృష్టిస్తున్నాడు. ఆసియా కప్‌లో అద్భుత ప్రదర్శన చేసిన ఈ యువకుడు ఇప్పుడు ఆసీస్ పిచ్‌లపై ఎలా రాణిస్తాడోనని అభిమానులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు, టీమిండియాపై విరుచుకుపడే ట్రావిస్ హెడ్ కూడా చక్కటి ఫామ్‌లో ఉన్నాడు. ఐపీఎల్‌లో ఈ ఇద్దరూ కలిసి సన్‌రైజర్స్ తరపున పేలవ జట్లను చిత్తుచేసిన సంగతి తెలిసిందే. వీరి ఢీ సిరీస్ హైలైట్ కానుంది. ఇతర ఆటగాళ్లలో టీమిండియా నుంచి తిలక్ వర్మ, శుభమన్ గిల్, అలాగే ఆసీస్ నుంచి మిచెల్ మార్ష్, టిమ్ డేవిడ్, గ్లెన్ మ్యాక్స్‌వెల్ వంటి ఆటగాళ్లు కీలక పాత్ర పోషించనున్నారు.

వన్డే సిరీస్ తర్వాత ఈ టీ20 పోరాటం రెండు దేశాల అభిమానుల్లో కొత్త ఉత్సాహం రేపుతోంది. "వన్ డేలు బ్రేక్‌ఫాస్ట్ అయితే, టీ20లు ఫుల్ మీల్స్!" అంటూ అభిమానులు ఇప్పటికే సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు.

**భారత జట్టు**

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, శుభమన్ గిల్, తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, శివమ్ దుబే, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ, వరుణ్ చక్రవర్తి, జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, సంజూ శాంసన్, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్.




**ఆస్ట్రేలియా జట్టు**

మిచెల్ మార్ష్ (కెప్టెన్), సీన్ అబాట్, జేవియర్ బార్ట్‌లెట్, మాహ్లీ బియర్డ్‌మన్, టిమ్ డేవిడ్, బెన్ ద్వార్షిస్, నాథన్ ఎలిస్, జోష్ హేజెల్‌వుడ్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కూహ్నెమన్, మిచెల్ ఒవెన్, జోష్ ఫిలిప్, మాథ్యూ షార్ట్, మార్కస్ స్టొయినిస్, ఆడమ్ జాంపా.

**సిరీస్ ముఖ్యాంశాలు**

అక్టోబర్ 29: తొలి టీ20 కాన్‌బెర్రా
అక్టోబర్ 31: రెండో టీ20 మెల్‌బోర్న్
నవంబర్ 2: మూడో టీ20 హెూబర్ట్
నవంబర్ 6: నాలుగో టీ20 గోల్డ్ కోస్ట్
నవంబర్ 8: ఐదో టీ20 బ్రిస్బేన్

**మ్యాచ్ సమయం: మధ్యాహ్నం 1.45 (భారత కాలమానం)**
**లైవ్: స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా**



## ఇంగ్లండ్ పేసర్ అండర్సన్‌కు 'నైట్‌హుడ్' గౌరవం

- **జాతీయ జట్టుకు 21 ఏళ్ల సేవలకు ప్రతిష్ఠాత్మక బిరుదు**

**బలగం టీవీ, లండన్**

ఇంగ్లండ్ వెటరన్ పేసర్ జేమ్స్ అండర్సన్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఫాస్ట్ బౌలర్‌గా ఇంగ్లండ్ జట్టుకు 21 సంవత్సరాలపాటు విశిష్ట సేవలందించినందుకు ఆయనకు బ్రిటన్ ప్రభుత్వం 'నైట్‌హుడ్' బిరుదు ప్రదానం చేసింది. విండ్సర్ క్యాసిల్‌లో మంగళవారం జరిగిన ఘన కార్యక్రమంలో బ్రిటన్ రాజ కుటుంబ సభ్యురాలు ప్రిన్సెస్ అన్నె చేతుల మీదుగా అండర్సన్ ఈ ప్రతిష్ఠాత్మక బిరుదును స్వీకరించాడు. భార్య, పిల్లలతో కలిసి ఈ వేడుకకు హాజరైన అండర్సన్, అనంతరం తాను అందుకున్న నైట్‌హుడ్ మెడల్ను చూపిస్తూ ఆనందం వ్యక్తం చేశాడు. ఈ గౌరవంతో ఇకపై ఆయన పేరు ముందు 'సర్ జేమ్స్ అండర్సన్' అని పిలవబడనున్నారు. బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్ నైట్‌హుడ్ అవార్డు కోసం జిమ్మీ అండర్సన్ పేరును సిఫారసు చేశారు. ఈ అవార్డుకు కన్జర్వేటివ్ పార్టీ ప్రధాని నామినేట్ చేసిన రెండో మాజీ ఆటగాడిగా ఆయన గుర్తింపు పొందాడు. గతంలో 2019లో మాజీ ప్రధాని థెరీసా మే ఇంగ్లండ్ లెజెండ్ జెఫ్రీ బాయ్‌కాట్కు ఈ గౌరవం అందజేశారు. ఈ బిరుదుతో అండర్సన్ తన సహచరులు సర్ ఆండ్రూ స్ట్రాస్, సర్ అలెస్టర్ కుక్ సరసన చేరాడు. ఇప్పటివరకు కేవలం 12 మంది ఇంగ్లండ్ మాజీ ఆటగాళ్లు మాత్రమే ఈ అత్యున్నత గౌరవం పొందిన వారిలో అండర్సన్ తాజా సభ్యుడిగా నిలిచాడు.

## వివేక్ ఒబెరాయ్ ఉదారత

- **'రామాయణం' సినిమాలో పారితోషికం అంతా విరాళం!**

**బలగం టీవీ, హైదరాబాద్**



బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ తన మానవతా దృక్పథంతో మరోసారి అభిమానుల హృదయాలను గెలుచుకున్నారు. అగ్రదర్శకుడు నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం లి'రామాయణం'లిలో ఆయన విభీషణుడి పాత్రలో నటిస్తున్నారు. ఈ భారీ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, యష్ రావణుడిగా నటిస్తున్నారు. తాజాగా వివేక్ తన పాత్రకు సంబంధించిన పారితోషికం మొత్తాన్ని క్యాన్సర్ బాధిత పిల్లల కోసం విరాళంగా ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. "నా జీవితంలో నేను చేసే ప్రతి పని ప్రేమతోనే చేస్తాను. ఈ సినిమాలో నాకు ఇచ్చే పారితోషికాన్ని నేను స్వీకరించను. దాన్ని క్యాన్సర్‌తో పోరాడుతున్న పిల్లల చికిత్స కోసం వినియోగించండి అని నిర్మాత నమిత్ మల్హోత్రాకి స్పష్టంగా చెప్పాను," అని వివేక్ చెప్పారు.

వివేక్ ఈ నిర్ణయంపై అభిమానులు, సినీ ప్రముఖులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. సోషల్ మీడియాలో "నిజమైన హీరో", "మానవతా మూర్తి" అంటూ కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి. 'రామాయణం' చిత్రాన్ని సుమారు రూ. 4000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇది భారత సినీ చరిత్రలో అత్యంత ఖరీదైన చిత్రాల్లో ఒకటిగా నిలవనుంది. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయాలని చిత్రబృందం యోచిస్తోంది.



## మార్చి 19న 'డకాయిట్' విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన ప్రేమకథా చిత్రం 'డకాయిట్' రిలీజ్ తేదీ ఖరారైంది. మొదట క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న విడుదల చేయాలని భావించిన చిత్రబృందం, షెడ్యూల్ కారణాల వల్ల వాయిదా వేసి మార్చి 19, 2026న ఉగాది కానుకగా ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ప్రకటించింది. ఈ చిత్రాన్ని షానీల్ డియో దర్శకత్వంలో రూపొందిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. కెమెరామెన్‌గా 'క్షణం', 'గూఢచారి' వంటి చిత్రాలకు పనిచేసిన షానీల్ డియో ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మొదట ఈ ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా శృతి హాసన్ ఎంపిక కాగా, అనివార్య కారణాలతో తప్పుకోవడంతో ఆమె స్థానంలో మృణాల్ ఠాకూర్ చేరారు. దీంతో సినిమా కొంత ఆలస్యమైంది. 'డకాయిట్'లో బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ కీలకమైన పోలీస్ అధికారిగా కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పోస్టర్లు ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేపాయి. సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో కొనసాగుతున్నాయి.